## గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

షాద్‌నగర్ పట్టణంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జనవరి 14: గ్రామీణ క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని క్రీడా మైదానంలో షాద్‌నగర్ క్రికెట్ ప్రీమియం లీగ్-4టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడలు మానసిక ప్రశాంతతను ఇవ్వడంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయన్నారు. ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని చెప్పారు. ప్రతి క్రీడకారుడు క్రీడా స్ఫూర్తి చాటి ఆదర్శంగా నిలువాలన్నారు. టోర్నమెంట్‌ను నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు బాబర్‌ఖాన్, అందె మోహన్, తిరుపతిరెడ్డి, శివశంకర్, ప్రదీప్, రవితేజ, నవీన్, సాయివంశీ, ప్రదీప్, మతిన్, మహ్మద్, రఘు పాల్గొన్నారు.

**అర్హులకు డబుల్‌బెడ్రూం ఇండ్లు**

షాద్‌నగర్ మున్సిపాలిటీలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్లను అర్హులకు మాత్రమే కేటాయిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణ శివారులోని డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలించి అక్కడ వసతులపై ఆరా తీశారు. నిర్మాణ విషయంలో మిగిలి ఉన్న పనులను పూర్తి చేయిస్తామని, ప్రజలకు నివాసాలకు అవసరమయ్యే మౌలిక వసతులను కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మెథడిస్ట్ చర్చిలో దుస్తుల పంపిణీ

మెథడిస్ట్ చర్చిలో దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

మొయినాబాద్, జనవరి 14 : మండల పరిధిలోని సురంగల్ గ్రామంలోని మెథడిస్ట్ చర్చిలో మాజీ వార్డు సభ్యులు నిర్డుల మహేందర్‌రెడ్డి, గడ్డం వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యుడు కొత్తపల్లి విక్రంరెడ్డి మహిళలకు చీరలు, పురుషులకు పాయింట్, షర్ట్ క్లాత్ పంపిణీ చేశారు. ఆదివారం సుమారుగా 90 జతలు చర్చిలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రామగల్ల కిష్టయ్య, మెథడిస్టు చర్చి సీనియర్ సభ్యులు టీ చంద్రశేఖర్, కర్రోళ్ల శ్రీకాంత్, రామగళ్ల శ్రీకాంత్, నెమిలిగారి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మేడి మహేశ్ తదితరులు

కడ్తాల్, జనవరి 14 : రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులతోపాటు డప్పు-చెప్పు వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మేడి మహేశ్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పిలుపు మేరకు ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్యర్యంలో ఫిబ్రవరి 29న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే 'ఛలో హైదరాబాద్ పోరు గర్జన'కు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేండ్లుగా పారిశుద్ధ్య కార్మికులు చాలీచాలని జీతాలలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులదే కీలకపాత్ర అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులరైజ్ చేసి జీతాలను పెంచాలన్నారు. అదే విధంగా డప్పు-చెప్పు వృత్తిదారులకు ప్రభుత్వం పింఛన్ అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంద రాజు, ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహా, నాయకులు వీరరాఘవులు, శ్రీశైలం, మణికంఠ, శ్రీకాంత్, రాజు, మహేశ్, రాజశేఖర్, రామకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

విజేతలతో ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రీడాకారులు

కడ్తాల్ : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో హనుమాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కడ్తాల్ ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) సీజన్-2 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. బహుమతి ప్రదానోత్సవంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని మాట్లాడారు. ప్రథమ స్థానంలో నిలిచిన మణికంఠగౌడ్ టీంకి ఎంపీటీసీ సమాకూర్చిన రూ.25,116, రన్నరప్‌గా నిలిచిన మహేశ్ జట్టుకి సర్పంచ్ సమకూర్చిన రూ.15,116 నగదు,షీల్డ్‌ను అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు జహాంగీర్‌బాబా, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు వెంకటేశ్, వార్డు సభ్యులు మహేశ్, రామచంద్రయ్య, హనుమాన్ యూత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి, హర్షవర్ధన్, కార్యదర్శి అశోక్‌రెడ్డి, యువజన సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రాఘవేందర్, నాయకులు జహంగీర్‌అలీ, యాదయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, వడ్డె రాజు, లక్ష్మయ్య, రమేశ్, విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

## నేడు అయ్యప్పఆలయంలో పూజలు

షాద్‌నగర్‌టౌన్, జనవరి 14: షాద్‌నగర్‌లోని శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలో సోమవారం అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సుప్రభాతం, నిర్మాల్యం, విశేష అభిషేకాలు, మంగళహారతి, సాయంత్రం పందలరాజు అలంకరణ, జ్యోతి దర్శనం అనంతరం పడి వందనం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మకర జ్యోతిని తిలకించేందుకు టీవీ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# ఊరూరా భోగి మంటలు

పెద్దఅంబర్‌పేట : 13వ వార్డు పరిధి సూర్యమెడోస్‌లో భోగి మంటలు

- పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు
- తెల్లవారుజామున కలాపి చల్లి ముగ్గులు వేసిన మహిళలు

ఇబ్రహీంపట్నం/ ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 14 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఆదివారం బోగిపండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచే ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి బొడ్డెమ్మలను పెట్టారు. బోగిపండుగ సందర్భంగా యువకులు, పెద్ద ఎత్తున బోగిమంటలు కాల్చారు. మూడురోజుల పాటు జరుగనున్న పండుగ సందర్భంగా సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు కూడా గ్రామాలకు చేరుకున్నారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. పండుగ సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని కిరాణాషాపులు సామాను కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. గ్రామాల్లో గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసులు కూడా సందడి చేశారు. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలతో పాటు ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్, పెద్దఅంబర్‌పేట్, ఆదిబట్ల మున్సిపాలిటీల్లో సంక్రాంతి పండుగ ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేశారు. పండుగ సందర్భంగా యువకులు గ్రామాల్లో క్రీడాపోటీలు నిర్వహించారు.

**చేవెళ్ల నియోజకవర్గంలో..**

షాబాద్ : చేవెళ్ల నియోజకవర్గంలో భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం నియోజకవర్గంలోని షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో ప్రజలు భోగి మంటలు వేశారు. అనంతరం మహిళలు వాకిళ్లలో కలాపిలు చల్లుకుని రంగురంగుల ముగ్గులు వేశారు. ఆయా గ్రామాల్లో యువకులు పతంగులు ఎగురవేశారు. గ్రామాల్లో ఎక్కడ చూసిన సంక్రాంతి పండుగ వేడుకల్లో ప్రజలు నిమగ్నమయ్యారు.

**పెద్దఅంబర్‌పేట :** మున్సిపాలిటీలో భోగి పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున భోగి మంటలు వేశారు. కాలనీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో పిల్లా పెద్దలతో కలిసి సందడి చేశారు. 13వ వార్డు పరిధి సూర్యమెడోస్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సంపత్‌కుమార్‌రెడ్డి, జగన్నాథ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. మాసింగ్‌బోర్డు కాలనీలో ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు కాలనీ ప్రెసిడెంట్ పాశం జైహింద్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

**కడ్తాల్ :** సంక్రాంతి పండుగకి ఆడపడుచులు, బంధువుల రాకతో గ్రామాల్లోని ఇండ్లన్ని కళకళలాడుతున్నాయి. ప్రజలు భోగి మంటలను ఏర్పాటు చేశారు. ప్రజలు తమ ఇండ్లలోని పాత వస్తువులను, సామాగ్రిని భోగి మంటల్లో వేశారు. చిన్న పిల్లలకు మహిళలు బోగి పండ్లను పోశారు.

ఇబ్రహీంపట్నం : ఇంటి ముందు వివిధ రకాల రంగులతో ముగ్గును అందంగా అలంకరించిన దృశ్యం..

## ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

షాద్‌నగర్‌రూరల్, జనవరి 14 : ఫరూఖ్‌నగర్ మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో ఆదివారం శ్రీరామలింగేశ్వర స్వామి పొదుపు సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు వివిధ రంగులతో ముగ్గులు వేశారు. ఏదిర శ్రీజ ప్రథమ బహుమతి సాధించింది. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీరమేష్, ఎలికట్ట ఉప సర్పంచ్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పోరు గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలి

కందుకూరు. జనవరి 14 : ఛలో హైదరాబాద్ పోరు గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మేడి మహేశ్ మాదిగ కోరారు. ఆదివారం కందుకూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వాల్ పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శీనన్న ఆదేశాల మేరకు అన్ని మండల కేంద్రాల్లో వాల్ పోస్టర్లను విడుదల చేస్తూ మాదిగలను చైతన్యం చేయడానికి ఈ నెల 29వ తేదిన డప్పు, చెప్పు వృత్తి దారుల పింఛన్ ఇవ్వాలని, పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ చలో హైదరాబాదు పోరు గర్జన బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. బహిరంగ సభకు పెద్ద ఎత్తున వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంద రాజు మాదిగ, ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ, నాయకులు కొమ్మగాల్ల నర్సింహ, గడ్డం క్రిష్ణ, జంగయ్య మాదిగ, ముచ్చర్ల నర్సింహ మాదిగ, యాదయ్య, సురేశ్ పాల్గొన్నారు.

## రాములోరి అక్షింతల వితరణ

షాబాద్ :సర్దార్‌నగర్‌లో అయోధ్య రాముడి అక్షింతల వితరణ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మునగపాటి స్వరూప, గ్రామస్తులు

షాబాద్, జనవరి 14: గ్రామాల్లో అయోధ్య రాముడి అక్షింతల వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్, మల్లారెడ్డిగూడ గ్రామాల్లో శ్రీరాముడి అక్షింతలను ఊరేగింపు చేపట్టారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహించి ఇంటింటికీ అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్, మల్లారెడ్డిగూడ గ్రామాల సర్పంచ్‌లు మునగపాటి స్వరూప, చందిప్ప జంగయ్య, ఉప సర్పంచ్‌లు ఇందిర, రంగం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నర్సింహులు, గ్రామస్తులు జగదీశ్, రాపోలు నర్సింహులు, సంజీవ, కృష్ణ, హరీశ్, ప్రదీప్, రఘు, చంద్రశేఖర్, నవీన్, అశోక్, విష్ణు, రమేశ్ పాల్గొన్నారు.

**మంచాల :** లోయపల్లిలో వైఎస్ ఎంపీపీ రాజేశ్వరి ఆధ్వర్యంలో అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేశ్, నాయకులు జంగయ్యగౌడ్, కొండల్, బండిరాజు, జానోజీ, సురేశ్, వెంకటేశ్, రాజు, రాంచంద్రయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంచాల : లోయపల్లి గ్రామంలో అక్షింతలు ఊరేగిస్తున్న వైస్ ఎంపీపీ, గ్రామస్తులు

# వైభవంగా గోదాదేవి కల్యాణం

పెద్దఅంబర్‌పేట : కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెద్దఅంబర్‌పేట, జనవరి 14: మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం హనుమాన్ నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో గోదా రంగనాథ స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. దాదాపు నెల రోజులుగా జరుగుతున్న తిరుప్పవై పూజలు కల్యాణంతో ముగిశాయి. కల్యాణానికి ముందుగా హోమం నిర్వహించారు. పండితులు వేద మంత్రాలు చెప్తుండగా.. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తుల మధ్య కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. సుందరకాండను సుందరదాసు ఆధ్వర్యంలో సంకిప్తంగా ప్రవచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి రమేశ్, కౌన్సిలర్ మద్ది శ్రీధర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు దేవిడి విజయ్ భాస్కర్‌రెడ్డి, జంగయ్య, ఆలయ కమిటీ ట్రెజరర్ జగన్‌మోహన్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి ఢిల్లి సంపత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు రాము, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్‌టౌన్ :** షాద్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదారంగనాయక స్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణం గోవిందా నామస్మరణతో మార్మోగింది. ఉదయం నుంచి స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

**కొత్తూరు :** శ్రీ రంగనాథ స్వామి గోదాదేవి కల్యాణం మహోత్సవాన్ని కొత్తూరు మండలంలోని పెంజర్ల అనంతపద్మనాభస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ బెజవాడ అనితారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపలి శంకర్, అనురాధ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఏటా భోగి రోజున విష్ణు ఆలయాల్లో గోదాదేవి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, సిద్దార్థరెడ్డి, మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌గౌడ్, నీలమ్మ, రవికుమార్‌గుపా పాల్గొన్నారు.

**చిలుకూరు బాలాజీ ఆలయంలో**

మొయినాబాద్ : అద్దాల మహాల్‌లో వేంకటేశ్వరస్వామి దివ్యమైన కల్యాణ మండపంలో గోదాదేవి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ మూనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ ఆధ్వర్యంలో వేదపండితులు కల్యాణం చేశారు.

షాద్‌నగర్‌టౌన్ : కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

## యువత క్రీడల్లోనూ రాణించాలి

మంచాల : క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్

మంచాల, జనవరి 14 : యువత క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ అన్నారు. సంక్రాంతి క్రీడోత్సవాల్లో భాగంగా ఆదివారం మంచాల మండలం చిత్తాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అదేవిధంగా అస్మత్‌పూర్‌లో నౌసురాములు స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌ను సీఐ కాశీవిశ్వనాథ్ ప్రారంభించారు. జాపాల, రంగాపూర్, ఆరుట్ల గ్రామాల్లో నిర్వహించిన క్రీడా పోటీలను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, సర్పంచ్‌లు నౌసు హరిప్రసాద్, బొడ్డు నాగరాజుగౌడ్, సహీదాబేగం, మమత, ఎంపీటీసీ శేఖర్‌రెడ్డి, సుకన్య, ఉపసర్పంచ్‌లు మల్లప్ప, రేణుక, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేశ్, నాయకులు బద్రి నాథ్‌గుప్తా, దన్నె భాషయ్య పాల్గొన్నారు.

**ఉత్సాహంగా క్రీడా పోటీలు**

పెద్దఅంబర్‌పేట : క్రీడా పోటీలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని ప్రజాప్రతినిధులు, పోటీల నిర్వాహకులు అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో వివేకానంద క్రీడోత్సవం-7 సీజన్ నిర్వహించారు. అండర్-16, అండర్-19 విభాగాల్లో కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు మాజీ ఎంపీ బూరనర్సయ్యగౌడ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముద్దం స్వరూప, ఎంపీటీసీ భాస్కర్, యువజన సంఘం సభ్యులు అరుణ్‌చారి, వినయ్ రెడ్డి, ప్రశాంత్‌చారి, రోహన్, రాహుల్, హరి కృష్ణ, శివ, అనిల్, ప్రసాద్‌రెడ్డి, బ్రహ్మాచారి, రమణ, మణికంఠ, రాజు పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట : విజేత జట్టుతో నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు

## ఘనంగా నల్లపోచమ్మ బోనాలు

చేవెళ్లటౌన్, జనవరి 14 : చేవెళ్ల మండల కేంద్రంలో నల్లపోచమ్మ బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పోచమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు దేవాలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాలతో మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించారు. బోనాల ఊరేగింపు ముందు పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, సర్పంచ్ శైలజ, సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ ఆగిరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

## ఎస్ఆర్‌డీపీ పనుల్లో మరో అరుదైన ప్రాజెక్ట్

ఎల్బీనగర్, జనవరి 14 : ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎస్ఆర్‌డీపీ పనుల్లో అరుదైన మరో ప్రాజెక్ట్ అందుబాటులోకి రానున్నదని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఎల్బీనగర్ చింతలకుంట సమీపంలోని శ్రీకృష్ణానగర్ కాలనీ ఫ్లైఓవర్‌వద్ద జరుగుతున్న పనులను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఎస్ఆర్‌డీపీ పనుల్లో అరుదైన ప్రాజెక్ట్ అతి త్వరలో రాబోతోందన్నారు. బైరామల్‌గూడలో జరుగుతున్న లూప్ ఆకారం త్వరలో అందుబాటులోకి రానున్నదన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ట్రాఫిక్ సుడిగుండాలకు శాశ్వత పరిష్కారంగా రూ. 135 కోట్లతో లూప్ ఫ్లైఓవర్ల నిర్మాణం జరుగుతోందన్నారు. త్వరలో బైరామల్‌గూడ రెండవ లేవల్ ఫ్లై ఓవర్ కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనంతుల రాజారెడ్డి, బాబా తదితరులు పాల్గొన్నారు.